# కేసూ - కమామిషూ

## పాలపుగు వెంకటేశ్వరరావు

ఆ క్షణాన కాళ్ళు చేతులు చల్లబడి పోయిన అప్పారావు టక్కున ఆగిపోయాడు !

రిక్షాలో కాళ్ళు పెట్టుకునే చోట - నిగనిగ మెరుస్తూ నవ్వుతో పలకరిస్తూన్న కన్నెపిల్లలా వుంది, ఆ మనీపర్సు ! అప్పుడే - స్టేషన్నించి గవర్నరుపేటకి ఒక పాసింజర్ని తీసుకువచ్చింది ఆ రిక్షా. గమ్యస్థానం చేరకుండానే, మధ్యలో ఎవరో కనపడ్డే - 'హలో' అంటూ ఏలూరురోడ్డు సెంటర్లోనే దిగిపోయేడు ఆ పాసింజరు, నిర్లక్ష్యంగా; రూపాయి నోటిచ్చి చిల్లరకోసం ఆగకుండానే. అతను వయసు మీదున్నాడు. ఖరీదయిన పాంటూ, బుష్షర్టూ వేసుకున్నాడు. మొహానికి నల్లద్దాల కళ్ళజోడు పెట్టుకున్నాడు. అది అప్పారావు కారోజు మొదటి బేరం.

'రిక్షా అప్పారావు' మనసు అల్లకల్లోల మయింది ! ఆ పర్సుతీసి నిక్కరు జేబులో పెట్టాడు; అయిష్టంగానే. కాంతయ్య హోటల్లో కాఫీ తాగుతున్నంత సేపూ - ఆ తర్వాత మధ్యాన్నందాకా రిక్షాలాగుతూ వున్నంత సేపూ అప్పారావు కళ్ళు ఆ పాసింజరుకోసం వెతుకుతూనే వున్నాయి. అప్పారావు మనసు ఆ మనీ పర్సు గురించే ఆలోచిస్తూవుంది. ఎవరూ తనని చూడటం లేదనుకున్నప్పుడు - నిక్కరు జేబులోంచి ఆ పర్సు తీసి చూసాడు, అప్పారావు.

అది చాలా ఖరీదయిన మనీపర్సు. పాము చర్మంతో చేసినది.

పైన ఎడ్రస్ వుండాల్సిన జాగా ఖాళీగా ఉంది.

అప్పారావు ఆ పర్సు తీసి లోపల చూద్దామనుకున్నాడు గాని మనసులోని భీతివలన ఆ పని చేయలేకపోయాడు

అప్పారావు మనసు మనసులో లేదు. జేబులో పాముపిల్లని పెట్టుకున్నవాడి చందాన కళవళ పడిపోయాడు. ఆ పాసింజరుని వెతికి పట్టుకోవటం చాలా కష్టం. విజయవాడవంటి పట్నంలో అయితే ఆ పని కుందేటి కొమ్ముని సాధించినట్లే !

మధ్యాహ్నపు ఎండ మిటమిట లాడింది.

రిక్షాని పోలీసు స్టేషను ప్రక్కనున్న మర్రిచెట్టు నీడన ఆపి - కాళ్ళు బార చాపుకుని బీడీ కాలుస్తూ ఆ మనీపర్సు గురించీ, దాన్ని చేజార్చుకున్న ఆ పాసింజరు గురించీ ఆలోచిస్తూ పడు కున్నాడు అప్పారావు.

రోడ్డుమీద వచ్చేపోయే వాళ్ళని పరకాయించి చూస్తూ - అప్పారావు కళ్ళు ఆ పాసింజరుకోసం వెతుకుతూనే వున్నాయి.

ఆ పోలీసుస్టేషన్లో కుర్చీల్లో కూర్చుని వున్నారు యస్. ఐ., సి. ఐ.

సి. ఐ. ఆ రోజే - సెలవుమీద ఊరికెళ్ళి - తిరిగివచ్చి డ్యూటీలో జాయినయాడు. పరామర్శలూ అవీ అయాక - 'మీ కొక చిత్రమయిన కథ చెపుతాను, వింటారా ?' అన్నాడు సి. ఐ.

'చెప్పండి. వింటాను. ఖాళీయే గదా !' అంటూ ఆ టెన్షన్ లో కూర్చున్నాడు యస్. ఐ.


'ఇవాళ తెల్లవారుఝామున మా రైలు ఏలూర్లో ఆగినప్పుడు, మా పెట్టెలోకి ఒక పాసింజరు వచ్చాడు. అతను స్టూడెంటు కుర్రాడులాగ వున్నాడు. రాత్రిపూట అయినా మొహాన్నున్న గాగుల్సు తీయలేదు. ఖరీదయిన బట్టలు వేసుకుని గోల్డుఫ్లాక్ సిగరెట్లు వూదేస్తు న్నాడు. పెట్టెలో ఎక్కడా జాగాలేదు. అతను వచ్చి నా సీటుదగ్గర నిలబడ్డాడు. నేను సర్దుకుని జాగాచేసి కూర్చో మన్నాను. అతను 'థాంక్యూ' చెప్పి కూర్చుని నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు.

అతను మంచి మాటకారి.

స్నేహశీలి కూడా అన్పించింది. తన పేరు, ఊరు చెప్పాడు. అతని ఊరు బెజవాడ. పేరు కృష్ణ. కృష్ణ అంతలోనే మాటలు కలిపాడు. సిగరెట్ ఆఫర్ చేసాడు. పవరుపేటలో టీ తెప్పించుకుని తాగుతూ, బలవంతంచేసి నాచేత కూడా తాగించాడు.

మా ఇద్దరి మధ్యా ఎన్నో విషయాలు దొర్లిపోయాయి. తన గురించి చెప్పాడు. అంత చిన్న వయసులోనే బిజినెస్‌లో దిగాడుట. మంచి ఫ్లరిషింగ్‌గా వుందట. ఇంకా పెళ్ళి కాలేదట. కట్నంతో పని లేదట. గుణవంతురాలయిన అందమయిన కన్య దొరికితే పెళ్ళిచేసుకుంటాట్ట. కులం మతం పట్టింపులు లేవట. వాళ్ళు బ్రాహ్మలట ! ఎడ్రసు ఇచ్చాడు. ఫోనునంబరు కూడా ఇచ్చాడు.

నా మనసులో పెళ్ళీడు కొచ్చిన మా పెద్దమ్మాయి మెదిలింది. మా అమ్మాయి



అందమయిన పిల్ల. ఇంటరు చదువుతోంది. ఈ కుర్రాడు అందగాడు. బుద్ధిమంతుడూ ధనవంతుడూలాగ వున్నాడు. ఈడూ జోడూ బాగా వుంటుంది - అనుకుంటూనే నా కనులు నిద్రకి ఆగలేక మూసుకొనిపోయాయి.

తిరిగి నాకు మెలకువ వచ్చేసరికి రైలు బెజవాడ ప్లాటుఫారంమీద ఆగుతోంది. ప్లా టు ఫా ర ం మీ ద కలకలం.

ఆ కుర్రాడు గబగబ లేచి 'మళ్ళీ కలుద్దాం సార్' నాతో అని - 'హలో' అంటూ ఎవర్నో పిలుస్తూ రైలు దిగి జనప్రవాహంలో కలిసిపోయాడు.

నేను రిక్షామీద ఇంటికి చేరుకున్నాక జేబులో చెయ్యిపెట్టి చూస్తే ఒక చిత్రమయిన యదార్థం నాకు తెలిసివచ్చింది. వెంటనే కృష్ణ ఇచ్చిన నంబరుకి ఫోను చేసాను. మనిషిని పంపి అతను ఇచ్చిన ఎడ్రసుని వాకబు చేసాను. నాకు అందిన వివరాల ప్రకారం ఆ నంబరు గల ఫోను ఆసామీకి కృష్ణ అన్న పెద్ద మనిషే తెలీదు! ఆ ఎడ్రసుగల ఇంటిలో అటువంటి పేరుగలవాడు ఎవడూ లేడు...!'

'ఇంతకీ అసలు జరిగిన సంగతి చెప్పనేలేదు,' అన్నాడు ఎస్సై.

'చెప్తాను, ఇంకా మీరు వూహించనే లేదా ?'

ఎస్సై ఆలోచనలో పడ్డాడు.

అంతలో ఫోను మ్రోగింది. సి. ఐ. అందుకున్నాడు – ఫోనులో ఎవర్తోనో మాటల్లోపడ్డాడు

ఉన్నట్లుండి రిక్షా అప్పారావు కళ్ళు మెరిసాయి !

చివాలున లేచి కూర్చున్నాడు ! రిక్షామీంచి కిందికి వురికి పరిగెత్తాడు.

'సార్ ! సార్ !'

ఆవతలి మనిషి ఆగి చిత్రంగా చూసాడు.

'ఇదిగోండి సార్ మీ పర్స్. ప్రొద్దుట నా రిక్షాలో పారేసుకున్నారు. అప్పటి నుంచి మీకోసం వెతుకుతూనే వున్నాను. తీసుకోండి సార్.' అంటూ జేబులోంచి ఆ పర్సుని తీసి ఆ మనిషిచేతిలో పెట్టాడు అప్పారావు.

ఆ మనిషి చిరునవ్వు నవ్వేడు. చిరునవ్వులు చిందిస్తూనే ఆ పర్సు తెరిచి చూసాడు. అతని మొహంలో చిరునవ్వు మాయమయింది. భ్రుకుటి ముడిపడింది. మొహం ఎర్రగా అయింది.

'గొప్ప నిజాయతీపరుడిలాగ పర్సు ఇచ్చావు. బాగానే వుంది. కాని ఇందులో వుండాల్సిన డబ్బు ఏది?' అని అడిగాడు ఆ మనిషి.

అప్పారావు తెల్లమొహం వేసాడు.

'డబ్బా ?'

'అవును, డబ్బేరా. నాల్గువంద లుండాలి.'

గజగజ వణికిపోయా డప్పారావు. 'నాకేం తెలీదు సార్.'

'దొంగ రాస్కెల్, తెలీదంటే సరిపోతుం దనుకున్నావా ? నా డబ్బేది ? తియ్యి బయటికి.'

'మాటలు జాగ్రత్తగా రానీండి. నేనేం దొంగను కాను' అన్నాడు అప్పారావు. అంతలోనే ఆ మనిషి అప్పారావు చొక్కా కాలరు పట్టుకున్నాడు. ఆ గొడవకి నల్గురూ చేరారు.

అందరూ కలిసి అప్పారావుని పోలీసు స్టేషన్కి తీసుకుని వెళ్ళారు.

సి. ఐ. ఫోనులో చాలాసేపే మాట్లాడేడు. డి.యెస్పీ గారు ఆయనకి ఫోను చేయటంవలన అంత టైము పట్టింది. ఫోను పెట్టేసి వొళ్ళు విర్చుకుని ఆయన ముందు హాలులోకి వచ్చేసరికి యస్సయి అప్పుడే వచ్చిన ఆ కొత్త కేసులో తలమునకలయిపోయి ఉన్నాడు.

'ఏమిటి సంగతి ?' అన్నాడు సి.ఐ. దర్పంగా, తలవంచుకునే.

'పిక్ పాకెట్ కేసు సార్' అన్నాడు యస్సయి.

'అలాగా ! ఎలాగయిందట ?'

యస్సయి క్లుప్తంగా వివరించాడు కేసుని.

'ఆల్ రైట్ – లెట్ మీ డీల్ విత్ దిస్ కేస్, కమింగ్ టూ ది పాయింట్.'

'అపరాధి ఎవరు ?'

'అదుగో వాడే సార్. రిక్షాఅప్పారావు గాడు.'

అగ్నిగోళాల్లాంటి కళ్ళతో సి. ఐ. 'రిక్షా అప్పిగాడ్ని' తీవ్రంగా చూసాడు. గర్జించాడు. చలి జ్వరం వచ్చినవాడి వలె గ జ గ జ వణికిపోయాడు అప్పారావు. 'ఇదేంట్రా నాయనా ? పుణ్యాకని పోయి ఇందులో ఇలా గిరుక్కున్నా నేమిట్రా బాబూ !' అనుకుంటు గిలగిలలాడిపోయాడు.

'ఫి ర్యా ది ఎవరు ?' సి. ఐ. అడిగాడు.

పోగుపడిన జనంలోంచి ఆ 'పర్సు మనిషి' ముందు కడుగేసాడు. ఆ మనిషిని తీక్షణంగా చూసాడు సి. ఐ. ఏదో గుర్తువచ్చినట్లు తల పంకించాడు.

'ఆ పర్సు ఏదీ ?'

'ఇదిగోండి సార్. అంతా ఖాళీ. వాడే కొట్టేసాడు,' అంటూ అందించిన ఆ పర్సుని అటు ఇటు త్రిప్పి చూసాడు. పాముచర్మంతో చేసిన ఆ మనీపర్సుని చూసి సి. ఐ. కళ్ళు మెరిసాయి.

'మిస్టర్ సుదర్శన్.'

'యస్సార్,' అంటూ ఎటెన్షన్‌లో నిలబడ్డాడు యస్. ఐ.

'ది కేస్ ఈజ్ సింపుల్. రిక్షా అప్పారావుకి ప ది రూ పా య లు బహుమానం ఇచ్చి పంపించేయి. ఆ ఎమవుంటు నే నిస్తాను.'

'అదేంటి సార్ ?'

'యస్. అరెస్ట్ దిస్ ఫెలో. వీడి జేబులు వెతికించండి. ఈ మనీపర్సు లోంచి మాయమయిన డబ్బు వాడి దగ్గర వుంటుంది. ఇందులో వుండాల్సింది నాల్గు వందలు కాదు, నాల్గు వేలపైన.' ఆర్డర్సు వేసేడు సి. ఐ.

క్షణాల్లో ఆ ఆర్డర్స్ అమలుపరచ బడ్డాయి.

కొంచెం తక్కువగా నాల్గువేల చిల్లరా ఆ పెద్దమనిషి జేబుల్లో దొరికింది. అప్పారావు దండాలుపెట్టి దేముడ్ని తల్చుకుంటూ వెళ్ళిపోయాడు. కేసును గురించిన రాతకోతలు అయి, ముద్దాయి తప్పు వొప్పుకున్నాక, వాడ్ని గదిలో బంధించి – కాఫీ త్రాగుతూ—

'ఇదంతా చాలా చిత్రంగా వుంది సార్. కాంప్లికేటెడ్ అనుకున్న కేసుని క్షణాల్లో తేల్చిపారేసారు. ఎలాగో నాకు అర్థమే కావటంలేదు,' అన్నాడు యస్సయి.

'దిస్ ఎరస్టెడ్ ఫెలో పేరు కృష్ణ. చాలా మిఖ్చవస్ అన్నమాట. అతితెలివి చూపించపోయాడు. వీడికి ఎరగా పాపం రిక్షా అప్పారావుగాడు దొరికిపోయాడు. అంతే ! అర్థమయిందా ?'

కాలేదన్నట్లు తల అడ్డంగా వూపాడు యస్సయి. సి. ఐ. నవ్వాడు.



'ఇందాక డి.యస్పీగార్నుంచి ఫోను వచ్చేముందు మీకు నేను ఒక కథ చెప్తున్నాను గుర్తు వుందా ?'

'ఆఁ, ఆఁ.'

'దాని ముగింపే ఇది !'

'అంటే ?'

'ఇంకా అంటే అంటావేమయ్యా ? ఈ పర్సు నాదే. రాత్రి రైలులో నా కళ్ళు గప్పి నన్ను మాటల్లో బుట్టలో వేసి ఇంతపని చేసిన గ్రంథసాంగుడూ, 'ఫ్లరిషింగ్ బిజినెస్‌మానూ,' కాబోయే అల్లుడిగా నా ఊహల్లో మెదిలిన దొంగ రాస్కెలూ అయిన ఈ కృష్ణగాడు అతితెలివి చూపించబోయి దొరికి పోయాడు – అదీ ! కేసూ...'

పోలీసు స్టేషన్లో గడియారం రెండు గంటలు కొట్టింది.